క్లుప్తంగా

పారదర్శకంగా సర్వేలు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో

బైరెడ్డిపల్లె: సర్వేలను పారదర్శకంగా నిర్వహించాలని జెడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు ఆదేశించారు. ఆయన బుధవారం లక్కనపల్లె సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం, పాఠ్యాంశాల బోధన తదితర విషయాలపై ఆరా తీశారు. అలాగే బైరెడ్డిపల్లె పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఎంపీడీవో కార్యాలయ ఏవో ఆనందబాబు, డిప్యూటీ ఎంపీడీవో నాగార్జునరెడ్డి, వైద్యాధికారిణి షాలిని, మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

అర్హులందరికీ అన్నదాత సుఖీభవ

చౌడేపల్లె: అర్హులందరికీ అన్నదాత సుఖీభవ పథకం అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ పార్వతి, ఏవో మోహన్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. వారు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ మండలంలోని 5,946 మంది రైతులు ఉండగా 200 మందికి పైగా అర్హత వున్నా వివిధ కారణాలతో పథకం అందలేదని తెలిపారు. వీఆర్వోలు సచివాలయాల్లో జాబితాను రైతులకు అందుబాటులో ఉంచేలా చూడాలని కోరారు. లబ్ధిపొందని రైతుల వివరాలు సేకరించి నిర్ణీత గడువులోపు నివేదిక అందజేయాలని సూచించారు. అర్హత వున్న వారికి నగదు అందేలా చూస్తామన్నారు. సమావేశంలో డీటీ రామ్మూర్తి పాల్గొన్నారు.

పలమనేరులో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

పలమనేరు: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు మూడు రోజులు కార్యక్రమాలు చేపడుతున్నట్టు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా ఇళ్లపై త్రివర్ణ పతాకాలు ఎగురవేయాలని పేర్కొన్నారు. వారు బుధవారం ప్రజాసంఘాలతో కలిసి పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఎంఈవో బాలసుందరం, మెప్మా సిబ్బంది, ఆర్పీలు, పలమనేరు పరిరక్షణ సమితి నిర్వాహకులు పాల్గొన్నారు.

డీఎస్సీలో 85.29 మార్కులు సాధించిన రెడ్డిరాణి



రొంపిచెర్ల: రొంపిచెర్ల పంచాయతీ ఇందిరమ్మ కాలనీకి చెందిన వి.రెడ్డిరాణి డీఎస్సీలో 85.29 మార్కులు సాధించి చిత్తూరు జిల్లానే మొదటి స్థానంలో నిలిచింది. ఆమెకు ఇంటర్ పూర్తి చేసిన వెంటనే తల్లిదండ్రులు తిరుపతి జిల్లా ఎర్రావారిపాళెం మండలం బోడేవాండ్లపల్లెకు చెందిన కుమార్‌రెడ్డికి ఇచ్చి పెళ్లి చేశారు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె వున్నారు. పెళ్లి చేశారు. తనకు బాగా చదువుకుని ఉద్యోగం చేయాలని వుందని భర్తకు చెప్పింది. అతను ఆమెను డీఎడ్ చదివించాడు. డీఎస్సీ పరీక్ష కోసం కోచింగ్‌కు పంపించాడు. ఈ క్రమంలో ఆమె (హాల్ టికెట్ 0160387) ఎస్జీటీ విభాగంలో డీఎస్సీ పరీక్ష రాసింది. ఇందులో 85.29 మార్కులు సాధించింది. డీఎస్సీలో మంచి మార్కులు సాధించిన రెడ్డిరాణిని పలువురు అభినందించారు.

దారి సమస్య పరిష్కారానికి చర్యలు

వి.కోట: మండలంలోని బోయచిన్నాగనపల్లి పంచాయితీ కడతనాయనపల్లి ఎన్నో ఏళ్లుగా రైతులు పొలాల్లోకి వెళుతున్న దారిని ఒక వ్యక్తి ఆక్రమించుకుని మూసేశాడు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం ఎంపీపీ యువరాజ్ దృష్టికి వచ్చింది. ఆయన బుధవారం గ్రామానికి వెళ్లి రైతులతో మాట్లాడారు. సమస్యను స్థానిక తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన తహసీల్దార్ భూమిని సర్వే చేయించి సమస్యను పరిష్కరించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన్నట్లు ఎంపీపీ తెలిపారు.

రోడ్లపైనే కోళ్ల వ్యర్థాలు



క్యాటిల్‌ఫామ్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద పడేసిన కోళ్ల వ్యర్థాలు

పలమనేరు: పట్టణ సమీపంలోని హైవేలో క్యాటిల్‌ఫామ్, ఆంజనేయస్వామి ఆలయం, గంగవరం బైపాస్ తదితర ప్రాంతాల్లో కొందరు కోళ్ల వ్యర్థాలు పడేస్తున్నారు. దీంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఈ మార్గాల్లో వెళ్లే వాహనదారులు ముక్కులు మూసుకోవాల్సి వస్తోంది. మూడు రోజుల క్రితం క్యాటిల్‌ఫామ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద పడేసిన వ్యర్థాల వల్ల దుర్గంధం వెదజల్లుతోంది. అక్కడే బస్టాప్ ఉండడంతో ప్రయాణికులు నిలబడలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు పక్కనే వాహనాలు

- ప్రమాదాలకు కారణమవుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు



పలమనేరు సమీపంలోని సిల్క్‌ఫామ్ వద్ద రోడ్డు పక్కన ఉన్న సుమో

పలమనేరు: నియోజకవర్గంలోని జాతీయ రహదారుల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రమాదాలకు గురైన వాహనాలను రోడ్డు పక్కనే వదిలేస్తున్నారు. వీటిని ఇతర వాహనాల డ్రైవర్లు రాత్రిళ్లు గుర్తించలేకపోతున్నారు. తీరా దగ్గరకు వచ్చినప్పుడు వాటిని తప్పించే క్రమంలో ప్రమాదాలకు గురి అవుతున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదు. పలమనేరు పట్టణ సమీపంలోని హైవేలోని మొగిలి ఘాట్, కుప్పం రోడ్డు, క్యాటిల్‌ఫామ్ నుంచి నంగళి వరకు, స్థానిక బైపాస్ రోడ్డులో నిత్యం ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు నుజ్జునుజ్జు అయి ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. కేసులు నమోదు చేసిన తర్వాత పోలీసులు వాటిని అక్కడి నుంచి తొలగించాల్సింది. వారు నిర్లక్ష్యంగా రోడ్ల పక్కనే వదిలేస్తున్నారు. రాత్రి ఆయా మార్గాల్లో ప్రయాణించే వాహనాల డ్రైవర్లు దెబ్బతిన్న వాహనాలను గుర్తించలేకపోతున్నారు. తీరా దగ్గరకు వచ్చినప్పుడు వాటిని గుర్తించి తప్పించే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల పలమనేరు సమీపంలోని సిల్క్‌ఫామ్ వద్ద సుమో, స్కార్పియో ఢీకొన్నాయి. సుమో బాగా దెబ్బతినడంతో అక్కడే వదిలేశారు. దాన్ని పక్కకు తొలగించలేదు. ఈ విషయం తెలియని వాహనచోదకులు దాన్ని ఢీకొనడం లేదా దాన్ని తప్పించబోయి ప్రమాదాలకు గురవుతున్నారు. అదే విధంగా పలమనేరు నుంచి ముళబాగిలు వెళ్లే రోడ్డు, మొగిలి ఘాట్, బైపాస్ రోడ్డులోనూ వాహనాలు వున్నాయి. ఈ విషయంపై స్థానిక సీఐ నరసింహరాజు వివరణ ఇస్తూ ప్రమాదాల్లో దెబ్బతిన్న వాహనాలను తొలగిస్తామని పేర్కొన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిద్దాం



ఈడిగపల్లెలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న భాస్కర్‌రెడ్డి, అమరనాథరెడ్డి

పుంగనూరు: అలవిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు హామీలను అమలు చేయకుండా చేస్తున్న మోసాలను ప్రజలకు వివరిద్దామని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అమరనాథరెడ్డి, మాజీ ఎంపీపీ నరసింహులుతో కలిసి చంద్రమాకులపల్లె, ఈడిగపల్లె, బోడేవారిపల్లె, నేతిగుట్లపల్లె, పాలెంపల్లె, రాగానిపల్లె పంచాయతీల్లో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది పాలనలో వైఎస్సార్ సీపీ నేతలపై దాడులు చేయడం, కేసులు బనాయించడం, ఆస్తులను ధ్వంసం చేయడం తప్ప ప్రజల సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా మోసం చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాలను ఇంటికీ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో బోయకొండ మాజీ చైర్మన్ నాగరాజారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి దేశిదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజశేఖర్‌రెడ్డి, కో ఆప్షన్ మెంబరు బాబ్‌జాన్, జయరామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సుబ్రమణ్యం, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల భర్తీ

కుప్పం: కుప్పం నియోజకవర్గానికి చెందిన పలువురు కూటమి నేతలకు ప్రభుత్వం నామినేటెడ్ పదవులను కల్పించింది. పలమనేరు-కుప్పం-మదనపల్లె అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా బీఆర్.సురేష్‌బాబు, కుప్పం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గుడుపల్లి మాజీ ఎంపీపీ ఎ.ఎం.రాజు, వైస్ చైర్మన్‌గా ప్రియా శరవణ, కుప్పం రెస్కో చైర్మన్‌గా వి.జి.ప్రతాప్ కుమార్, వైస్ చైర్మన్‌గా విశ్వనాథ్, కుప్పం ఏరియా ఆస్పత్రి వైస్ చైర్మన్‌గా భారతి త్రిలోక్‌ను నియమిస్తున్నట్లు ప్రకటన విడుదలైంది. దీంతో పాటు ఒక్కొక్క కమిటీకి 13 మంది సభ్యులను నియమించినట్లు తెలిపారు.

ఆర్టీసీ డిపో ఎదుట ఎన్‌ఎంయూ ధర్నా



ధర్నా చేస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు

కుప్పం: రాష్ట్ర వ్యాప్తంగా వున్న ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. వారు బుధవారం కార్మికులతో కలిసి కుప్పం ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేశారు. ఎన్‌ఎంయూ డిపో కార్యదర్శి జయపాల్ మాట్లాడుతూ ఆర్టీసీలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి తక్షణమే వేతన సవరణ చేయాలన్నారు. పాత బస్టాండు స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు ఇస్తూ ఇచ్చిన జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో వున్న నాలుగు డీఏలు, రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు మునుస్వామి, నాయకులు మునెప్ప, నవీన్, దిలీప్, జయశంకర్ పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు



ర్యాలీ చేస్తున్న పీఈఎస్ వైద్య విద్యార్థులు

గుడుపల్లె: మత్తు పదార్థాలు వినియోగించడం వల్ల జీవితాలు నాశనం అవుతాయని పీఈఎస్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హెచ్‌ఆర్ క్రిష్ణరావు తెలిపారు. ఆయన బుధవారం విద్యార్థులు, సిబ్బందితో కలిసి కళాశాల మెయిన్ గేటు వద్ద ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలను వినియోగించవద్దని సూచించారు. విద్యార్థులందరూ స్నేహ భావంతో మెలగాలన్నారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు.

వందకు రెండు వందలు!

భూమి లేదా స్థలం కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి, అగ్రిమెంట్‌కు స్టాంపు పేపర్లు తప్పనిసరి. ఇందుకోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్దకు పరుగులు తీయాల్సిందే. దీన్ని ఆసరాగా తీసుకున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగులు రూ.వంద స్టాంపులకు అదనంగా రూ.200లు వసూలు చేస్తున్నారు. ఎందుకని ప్రశ్నించిన వారిని అవసరముంటే కొనుక్కోండి.. లేదంటే వెళ్లిపోండి₹ అని చెబుతున్నారు. అంతటితో ఆగక బ్రోకర్లను నియమించుకుని వారితో యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సబ్ రిజిస్ట్రార్ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- స్టాంపుల విక్రయాల్లో దోపిడీ
- బ్రోకర్లతో ఉద్యోగుల కుమ్మక్కు
- మండిపడుతున్న జనం



పుంగనూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

పుంగనూరు: పుంగనూరు పట్టణానికి చెందిన నూర్ అహమ్మద్ అనే వ్యక్తి రూ.100ల స్టాంపును తన తల్లి ఫాతిమాబి పేరుతో కొనుగోలు చేసేందుకు దరఖాస్తు రాసుకుని సోమవారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాడు. అక్కడున్న సీనియర్ అసిస్టెంట్, సిబ్బంది కార్యాలయంలో స్టాంపులు లేవని చెప్పారు. ఎదురుగా ఉన్న షాపులో దొరుకుతాయని చెప్పడంతో అతను దరఖాస్తు తీసుకుని అక్కడికి వెళ్లాడు. వారు రూ.100 స్టాంపునకు అదనంగా రూ.200లు ఇవ్వాలని, లేకపోతే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపులు ఇవ్వరని తెలపడంతో అతను విస్తుపోయాడు. రూ.50 ఎక్కువ ఇస్తానని, స్టాంపు ఇవ్వాలని కోరాడు. వారు ససేమిరా అనడంతో గత్యంతరం లేక రూ.300లు చెల్లించాడు. బ్రోకర్ దరఖాస్తు తీసుకుని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోకి వెళ్లి సబ్‌రిజిస్ట్రార్ సంతకం చేసిన రూ.100 కంప్యూటర్ స్టాంపును తెచ్చి నూర్‌అహమ్మద్ చేతిలో పెట్టాడు. దీంతో నూర్‌అహమ్మద్‌కు దిమ్మతిరిగింది. స్టాంపులు లేవని కార్యాలయ ఉద్యోగులు చెప్పడం, బ్రోకర్ల దగ్గరకు వెళ్లాలని చెప్పడం, ప్రభుత్వ స్టాంపులు బ్రోకర్లకే ఇవ్వడంపై విలేకరులకు సమాచారం అందించాడు. కార్యాలయ ఉద్యోగులు స్టాంపుల డిమాండ్‌ను సృష్టించి, అధిక ధరలకు విక్రయించడం, రిజిస్ట్రేషన్లు, ఈసీలు, వ్యాల్యుయేషన్లు, వివాహ సర్టిఫికెట్లలో ఇష్టారాజ్యాంగా డబ్బు వసూలు చేయడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. ఈ విషయమై జిల్లా రిజిస్ట్రార్ తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై సబ్‌రిజిస్ట్రార్ సర్వేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా ఈ విషయం తనకు తెలియదని, స్టాంపులకు దరఖాస్తు చేస్తే వెంటనే ఇస్తున్నామని తెలిపారు. ఎవరైనా అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని, స్టాంపులకు అదనంగా డబ్బు ఇవ్వాల్సిన పనిలేదన్నారు. స్టాంపులు పంపిణీ చేసే సీనియర్ అసిస్టెంట్ అహమ్మద్‌బాషాను వివరణ కోరగా బయట స్టాంపులు తక్కువ ధరకు దొరుకుతున్నాయని చెప్పి పంపామని తెలిపారు.

కమనీయం.. సుబ్రమణ్యస్వామి కల్యాణం

గుడుపల్లె: గుడివంక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి కల్యాణం బుధవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి విశేష పూజలు చేశారు. ఆలయ ఆవరణంలో కల్యాణ వేదికను ఏర్పాటుచేసి అలంకరించారు. శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామిని కొలువుదీర్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఆలయం చుట్టు ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించారు. అన్నదానం చేశారు. గురువారం రథోత్సవం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

సోమలలో..

సోమల(చౌడేపల్లె): మండలంలోని బంగారు తిరుత్తణిలో వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీప్రత్యక్ష సుబ్రమణ్యస్వామి కల్యాణం బుధవారం కనుల పండువగా నిర్వహించారు. ఈ వేడుకను తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వారికి ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు.

భీమగానిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

పుంగనూరు: మండలంలోని భీమగానిపల్లెలో బుధవారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పవన్‌కుమార్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో జలుబు, దగ్గు, గొంతునొప్పి, జ్వరాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కలుషిత నీరు తాగడం, కలుషిత ఆహారం తినడం వల్ల టైఫాయిడ్, వాంతులు, విరేచనాలు, పచ్చ కామెర్లు వస్తాయని వివరించారు. ప్రజలు పరిసరాలను శుభ్రంగా వుంచుకోవాలని సూచించారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు వెంటనే డాక్టర్లను సంప్రదించి చికిత్స తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శారద, ఏఎన్‌ఎం భారతిదేవి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు రక్షిత మంచినీరు అందిస్తాం



పుంగనూరు పట్టణంలో మంచినీటి ట్యాంకులను పరిశీలిస్తున్న కమిషనర్ మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరికీ సురక్షితమైన మంచినీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పట్టణంలో ఉన్న 11 ఈఎల్‌ఎస్‌ఆర్ ట్యాంకులను పరిశీలించారు. వాటిని శుభ్రం చేయించి, క్లోరినేషన్ చేపట్టారు. అలాగే పైపులైన్లు లీకేజీల ద్వారా ట్యాంకుల్లోకి మురుగునీరు, వర్షపునీరు చేరకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

బైక్ బోల్తా పడి వ్యక్తికి గాయాలు

పుంగనూరు: పట్టణంలోని ఎంబీటీ రోడ్డులో బుధవారం ద్విచక్ర వాహనం బోల్తాపడి వ్యక్తి గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. సోమల మండలం కందూరుకు చెందిన అన్వర్‌బాషా(58) బైక్‌లో సొంత పనుల నిమిత్తం పుంగనూరు వస్తున్నాడు. ఎంబీటీ రోడ్డులో బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. గాయపడిన అతన్ని స్థానికులు 108లో పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నేటి నుంచి ఆడికృత్తిక ఉత్సవాలు



విశేషాలంకరణలో స్వామి

పెద్దపంజాణి: మండలంలోని నాగిరెడ్డిపల్లి పంచాయతీ సూరకుంట్ల సమీపంలోని మునీశ్వర స్వామి కొండపై గురువారం నుంచి 19వ తేదీ వరకు ఆడికృత్తిక ఉత్సాలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా మునీశ్వరస్వామి, విఘ్నేశ్వరస్వామి, సుబ్రమణ్యస్వామికి విశేష పూజలు, అభిషేకాలు, కావడి చెల్లింపు కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. చెక్కభజనలు, కోలాటాలు, వీధి నాటకాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు వుంటాయని తెలిపారు. కోగిలేరు జలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యంస్వామికి కల్యాణం, కావళ్ల చెల్లింపు కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆలయ ధర్మకర్తలు పేర్కొన్నారు.

సదుంలో..

సదుం: స్థానిక గార్గేయ నదీ తీరాన వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో గురువారం నుంచి ఆడికృత్తిక ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి తెలిపారు. 14న ధ్వజారోహణం, 15న భరణి కావళ్లు, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పట్టు వస్త్రాల సమర్పణ, 16న కృత్తిక కావళ్లు, కల్యాణోత్సవం, అన్నదానం, 17న స్వామి వారి ఊరేగింపు, 18న ధ్వజా అవరోహణ నిర్వహిస్తామన్నారు.





శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు, నిధుల కొరతతో ఆగిపోయిన మరుగుదొడ్ల నిర్మాణ పనులు

మరుగుదొడ్లు నిర్మించండి

రొంపిచెర్ల: 'గతంలో నిర్మించిన మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. కొత్త వాటిని నిర్మించండి' అని రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు కోరుతున్నారు. ఈ పాఠశాలలో 2012-13లో సర్వశిక్షా అభియాన్ కింద రూ.70 వేలతో విద్యార్థుల కోసం మరుగుదొడ్లు నిర్మించారు. కొద్ది రోజులు మాత్రమే వాటిని వినియోగించారు. తర్వాత నిర్వహణ లోపంతో పాడయ్యాయి. ప్రస్తుతం పిచ్చి మొక్కలు మొలిచి అధ్వానంగా మారాయి. వాటికి ఉపాధ్యాయులు తాళాలు వేశారు. 10 ఏళ్లుగా మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరుబయటికి వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. పాఠశాలలో 30 మంది బాలికలు కూడా ఉన్నారని, అత్యవసర సమయంలో వారి బాధలు అన్నీఇన్నీ కావు. మూడేళ్ల క్రితం మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ 60 శాతం పనులు చేసి నిధులు చాలకపోవడంతో ఆపేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో దళితులకు పెద్దపీట

కుప్పం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి దళితులకు పెద్దపీట వేశారని కుప్పం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లలితా మురుగేష్ తెలిపారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కుప్పం నియోజకవర్గంలో దళితులకు అనేక పదవులు ఇచ్చి చిత్తశుద్ధిని నిరూపించుకుందున్నారు. ముఖ్యంగా కుప్పం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తనను, రామకుప్పం సింగిల్ విండో చైర్మన్‌గా సుగుణప్ప, గుడుపల్లి సింగిల్‌విండో చైర్మన్‌గా నాగభూషణం, కుప్పం మున్సిపల్ వైస్ చైర్మన్‌గా మునుస్వామి, గుడుపల్లె వైస్ ఎంపీపీగా శ్రీనివాసులుకు పదవులు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కుప్పం నియోజకవర్గంలో దళితులకు సముచిత స్థానం కల్పించడం లేదని విమర్శించారు. ఈ విషయాన్ని దళిత నాయకులు గ్రహించాలని కోరారు. టీడీపీ ప్రభుత్వంలో కష్టపడిన వారికి గుర్తింపు దక్కదనడానికి నిదర్శనం ప్రస్తుతం ప్రకటించిన నామినేటెడ్ పదవులేనని వివరించారు. టీడీపీలో కొనసాగుతున్న దళితులు తమకు ఎందుకు పదవులు రాలేదో గ్రహించి ఇప్పటికైనా మేలుకోవాలని సూచించారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం





నూతన వధూవరులతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల: మండలంలోని పెద్దమల్లెల పంచాయతీ నడింపల్లెకు చెందిన ఓబుల భాస్కర్‌రెడ్డి కుమారుడు సునీల్ రెడ్డికి బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ ఫజులుపేటకు చెందిన లేట్ ముంతా చంద్రశేఖర్ రెడ్డి మనవరాలు మాధురి పెళ్లి బుధవారం నడింపల్లెలో జరిగింది. ఇందులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, నాయకులు ఓ.రామచంద్రారెడ్డి, రవీంద్ర, ప్రేమానందం, నీరజాక్షుల నాయుడు, వెంకటరత్నం, కరీముల్లా, ఎల్.మహబూబ్‌బాషా, విజయశేఖర్, శ్రీనాథనాయుడు, మంజూర్, బావాజీ సాహెబ్ తదితరులు వున్నారు.

వివాహ వేడుకలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

సదుం: మండలంలోని కంభంవారిపల్లెకు చెందిన ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ శివారెడ్డి కుమార్తె భవాని వివాహం అనిల్‌కుమార్ రెడ్డితో బుధవారం రాత్రి కాణిపాకంలో జరిగింది. ఈ వేడుకలకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, మోహన్ రెడ్డి, అన్నారెడ్డి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతలో దేశభక్తిని పెంపొందించాలి



పుంగనూరులో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

పుంగనూరు: ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, సీఐ సుబ్బరాయుడు తెలిపారు. వారు బుధవారం బసవరాజ ప్రభుత్వ కళాశాల విద్యార్థులతో కలిసి పట్టణంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు జగదీష్ రాజు ఆధ్వర్యంలో 300 అడుగుల జాతీయ జెండాను ఊరేగించారు. కమిషనర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలో చైర్మన్ అలీమ్‌బాషా, పాలకవర్గ సభ్యులు, అధికారులు, పట్టణ ప్రజలతో కలిసి స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఆగస్టు 15న మున్సిపల్ కార్యాలయంలో ఉన్న బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని, కార్మికులను సన్మానిస్తామని వెల్లడించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి



డైరెక్టర్ గురవయ్యకు స్వాగతం పలుకుతున్న ఈఈ శ్రీనివాసమూర్తి, ఏడీ శ్రీనివాసులు

పుంగనూరు: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య తెలిపారు. ఆయన బుధవారం పుంగనూరులో పర్యటించారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 33 కేవీ, 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ కావడం, డీటీఆర్, ఫెయిల్యూర్‌ను తగ్గించాలని ఆదేశించారు. అలాగే వ్యవసాయ సర్వీసులను సత్వరం మంజూరు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాతో పాటు బకాయిల వసూళ్లపైనా దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాసమూర్తి, ఏడీలు శ్రీనివాసులు, చిన్నబ్బ, ఏఈలు ఉమామహేశ్వరరావు, ధనుంజయమూర్తి, వెంకట్రమణ, జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మరో ఏడాది శిక్షణ



కొత్త ఇండ్లు గ్రామంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న గురువులు

కుప్పం: కుప్పం ప్రాంతంలో ఎంతో ప్రాముఖ్యం పొందిన ద్రౌపది తిరునాళ్లు, కళలపై విద్యార్థులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని మరో ఏడాది పొడిగిస్తూ సంగీత నాటక అకాడమీ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ద్రౌపది తిరుణాళ్ల గురువులు పీసీ మణి, రాఘవులు, మాలతి తెలిపారు. గతంలో సంగీత నాటక అకాడమీ న్యూఢిల్లీ సభ్యులు ఎస్పీ భారతి కొత్తఇండ్లు గ్రామాన్ని సందర్శించి మరుగున పడుతున్న ప్రాచీక కళలపై విద్యార్థులకు శిక్షణ తరగతులపై శ్రీకారం చుట్టారు. ఏడాది పాటు శిక్షణా తరగతులు కొనసాగాయి. ఈ క్రమంలో శిక్షణా తరగతులు మరో ఏడాది పొడిగిస్తున్నట్టు అకాడమీ ప్రతినిధులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో కొత్త ఇండ్ల గ్రామంలో ప్రాచీన కళలపై విద్యార్థులకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు గురువులు తెలిపారు.